

ధాన్యం దిగుబడిలో తెలంగాణ ఆల్ టైం రికార్డ్
పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్.కుమార్ రెడ్డి

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 2 సంచిక - 188 గురువారం16అక్టోబర్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts




## నేడు శ్రీశైలంలో భ్రమరాంబ మల్లికార్జునిడిని దర్శించుకుంటా...

- రూ.13, 400 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- ఎక్స్ వేదికగా మోడీ తెలుగులో ట్వీట్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 15(జర్నలిస్ట్ వార్త)::** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లా లో గురువారం పర్యటించనున్నారు. ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ప్రధాని పర్యటనలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా మిగతా2లో...

## జర్నలిస్టుల సంక్షేమానికి
# అత్యంత ప్రాధాన్యత

- త్వరలో అక్రిడిటేషన్ పాలసీ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్అక్టోబర్ 15(జర్నలిస్ట్ వార్త):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పాత్రికేయుల కోసం ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన జర్నలిస్టులకు అందేలా విధి విధానాలను రూపొందిస్తున్నామని తెలిపారు. బుధవారం నాడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ కమీషనర్ సిహెచ్. ప్రియాంక, సిపిఆర్వో మల్సూర్ తో కలిసి అక్రిడిటేషన్ పాలసీపై సుదీర్ఘంగా చర్చించారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టుల గౌరవాన్ని కాపాడేవిధంగా శాస్త్రీయ పద్దతిలో అక్రిడిటేషన్ పాలసీ ఉండాలని అధికారులను ఆదేశించారు. వీలైనంత త్వరగా అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయడానికి ఈనెల చివరినాటికి పాలసీ విధివిధానాలను కొలిక్కితీసుకురావాలని ఆదేశించారు.

## వందేభారత్ 4.0 వర్షన్
# అభివృద్ధి

- కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 15(జర్నలిస్ట్ వార్త):** భారతదేశపు సెమీ–హై–స్పీడ్ రైళ్ల జాబితాలో తర్వాత వర్షన్ రానుంది. వందేభారత్ 4.0 ను అభివృద్ధి చేయనున్నట్లు రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం ప్రకటించారు. ఎగుమతి గిరాకీలకు అనుగుణంగా దాని రూపకల్పన ఉంటుందని వెల్లడించారు. రైళ్ల ఆధునిక సాంకేతికత విషయంలో దేశాన్ని గ్లోబల్ సప్లయిర్గా మిగతా2లో...

## పుట్టెడు దుఖంలో ఉన్న ఆడబిడ్డను
# అవమానిస్తారా...?

మాగంటి సునీతను అవమానించేలా మంత్రులు మాట్లాడుతారా
చిల్లర రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్కు బుద్ది చెప్పాల్సిందే
కాంగ్రెస్, బిజెపిలు రాష్ట్రానికి చేసిందేమీ లేదు
మండిపడ్డ బిఆర్ఎస్ నేత హరీష్ రావు



**హైదరాబాద్,అక్టోబర్ 15(జర్నలిస్ట్ వార్త):** భర్తను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న ఆడబిడ్డను అవమానించే విధంగా కాంగ్రెస్ మంత్రులు మాట్లాడటం దుర్మార్గమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా కాంగ్రెస్ సంస్కృతి అని విమర్శలు చేశారు. జూబ్లీహిల్స్ ప్రజల ఆశీర్వాదంతో మాగంటి గోపీనాథ్ గెలిచారని తెలిపారు. దురదృష్టవశాత్తూ గోపీనాథ్ చనిపోయారని... ఆ కుటుంబాన్ని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిపించాలని కోరారు. మాగంటి గోపీనాథ్కి పెళ్లికాని ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని పేర్కొన్నారు. భర్తను కోల్పోయిన భార్య, తండ్రిని కోల్పోయిన పిల్లలు మిగతా2లో...

## జూబ్లీహిల్స్లో సాకులు వెదుకుతున్న బిఆర్ఎస్

- ఓటమి భయంతో ముందే కుంటిసాకులు: శ్రీధర్ బాబు






## మావోయిస్టులకు వరుస దెబ్బలు

సిఎం ఫడ్నవీస్ ముందు లొంగిపోయిన మల్లోజుల
అదే బాటలో తక్కళ్లపల్లి వాసుదేవరావు
నేడు ఛత్తీస్ గడ్ సిఎం ముందు లొంగిపోతారని ప్రచారం
సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట 27 మంది లొంగుబాటు

/నాగపూర్/హైదరాబాద్, అక్టోబర్ 15: ఏరివేత తప్పదు..లొంగిపోతే బతికిపోతారని కేంద్ర హోంమంత్రి హెచ్చిరికల నేపథ్యంలో మావోయిస్టులు భారీగా మిగతా2లో...



## హ్యామ్ రోడ్ల నిర్మాణంపై నేటి కేబినేట్లో నిర్ణయం

- అధికారులతో సమీక్షించిన మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్,అక్టోబర్ 15(జర్నలిస్ట్ వార్త):**హ్యామ్ రోడ్లు, టిమ్స్ హాస్పిటల్స్ వంటి పలు ప్రాజెక్టులపై చర్చించామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు, గత ప్రభుత్వం రోడ్ల నిర్మాణంలో తీవ్ర నిర్లక్ష్యం చూపిన కారణంగా, ప్రభుత్వం హ్యామ్ విధానంలో పెద్ద ఎత్తున రాష్ట్ర రోడ్లు నిర్మించాలనే నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.రోడ్లు, భవనాలు శాఖపై సమీక్ష నిర్వహించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నేటి కేబినెట్లో కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఎర్రమంజిల్ ప్రధాన కార్యాలయంలోని సమావేశంలో మంత్రి సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోడ్ల నిర్మాణంపై సీరియస్గా ఉన్నారని, రాష్ట్రంలో నాణ్యమైన రోడ్లు త్వరితగతిన పూర్తి చేయాలని దృష్టి సారిస్తున్నట్లు మంత్రి మిగతా2లో...

## జూబ్లీహిల్స్ బిజెపి అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి

- ఖరారు చేసిన బిజెపి అదిష్టానం



**హైదరాబాద్,అక్టోబర్ 15(జర్నలిస్ట్ వార్త):**జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు అభ్యర్థిని భాజపా ప్రకటించింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ.. బీజేపీ అభ్యర్థిని ఆ పార్టీ అగ్రనాయకత్వం ఖరారు చేసింది. లంకల దీపక్రెడ్డి పేరు ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. ఈ మేరకు పార్టీ వర్గాలు వెల్లడించాయి. 2023 ఎన్నికల్లోనూ దీపక్రెడ్డి జూబ్లీహిల్స్ భాజపా అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. అభ్యర్థి ఎంపిక కోసం నియోజకవర్గంలోని పలువురి సీనియర్ల పేర్లను బీజేపీ పరిగణలోకి తీసుకుంది. అందుకు సంబంధించిన జాబితాను రూపొందించి.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు న్యూఢిల్లీ తీసుకు వెళ్లి.. బీజేపీ అధిష్టానం ముందు ఉంచారు. అధిష్టానం లంకల దీపక్ రెడ్డిని ఎంపిక మిగతా2లో...




## కాందహార్లో పాక్ వైమానిక దాడులు

- 12 మంది అఫ్గన్ పౌరుల మృతి

## పదేళ్ల అభివృద్ధికి..రెండేళ్ల
# అరాచకానికి మధ్య పోరు

● జూబ్లీహిల్స్లో సునీత నామినేషన్లో పాల్గొన్న కెటిఆర్ ● జూబ్లీహిల్స్ నుంచి బిఆర్ఎస్ విజయయాత్ర అన్న కెటిఆర్

**హైదరాబాద్,అక్టోబర్ 15(జర్నలిస్ట్ వార్త):** జూబ్లీహిల్స్లో జరుగుతున్న ఎన్నిక పార్టీలు, ఇద్దరు వ్యక్తుల మధ్య జరుగుతున్న ఎన్నిక కాదని.. పదేండ్ల అభివృద్ధి, పాలనకి.. రెండు సంవత్సరాల అరాచక పాలనకి మధ్య జరుగుతున్న ఎన్నిక అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ల కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. పదేళ్ల రైతుబంధు పాలనకు, రెండు సంవత్సరాల రాక్షస పాలనకి మధ్య జరుగుతున్న ఎన్నికగా పేర్కొన్నారు. జూబ్లీహిల్స్లో ఆడబిడ్డ గెలుపు కోసం రాష్ట్రంలోని కోటి 67 లక్షల మంది ఆడబిడ్డలు ఎదురు చూస్తున్నారని.. ఆమె గెలుపుతోనైనా ప్రభుత్వం ఆడబిడ్డలకు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.2500 ఇస్తుందని ఆశిస్తున్నారన్నారు. లక్షల మంది రైతన్నలు ఈమె గెలుస్తుందని ఆశిస్తున్నారని తెలిపారు.ఆ తర్వాతే తమకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేస్తుందని.. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, తర్వాత మోసపోయిన యువతి యువకులు ఎదురు చూస్తు



న్నాన్నారు. తమ ఇళ్లు కూలగొట్టిన అరాచకాలను చూసిన తర్వాత, ఈ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి గెలవాలని, ఆ అరాచకాలు ఆగాలని హైదరాబాద్ నగర పేదలు మిగతా2లో...

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..



# మావోయిస్టులకు వరుస దెబ్బలు

(మొదటి పేజీ తరువాయి)

లొంపోతున్నారు. లొంగిపోయిన వారు బతికిపోతే.. లొంగని వారు తూటలకు బలవుతున్నారు. వచ్చే మార్చిలోగా మావోలను అంతం చేస్తామని, ఆపరేషన్ కగార్ చేపట్టి వందలాది మందిని మట్టుపెట్టారు. ఈ క్రమంలో కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ అభయ్ అధికారికంగా పోలీసులకు లొంగిపోయిన సంగతి తెలిసిందే. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ సమక్షంలో ఆయన ఆయుధాలు అప్పగించారు. ఇదిలావుంటే మావోయిస్టు పార్టీకి మరో బిగ్ షాక్ తగిలింది. మల్లోజుల బాటలో కీలక నేతలు నడిచేందుకు సిద్ధమయ్యారు. మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న పోలీసుల ఎదుట లొంగిపోయేందుకు రెడీ అయ్యారు. గురువారం ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ ముందు ఆశన్న లొంగిపోనున్నారని సమాచారం. ఆయనతో పాటు మరో 70 మంది మావోయిస్టులు కూడా సీఎం ముందు జనజీవన స్రవంతిలో కలవనున్నారు. బుధవారం ఛత్తీస్‌గఢ్ లోని సుక్మా జిల్లాలో 27 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు ప్రకటించారు. వీరిపై రూ.50లక్షల రివార్డు ఉంది. సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ అభయ్ అధికారికంగా పోలీసులకు లొంగిపోయిన సంగతి తెలిసిందే. మహారాష్ట్రలో ఈ మేరకు మల్లోజులను పోలీసులు మీడియా ముందుకు తీసుకొచ్చారు. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ సమక్షంలో ఆయన ఆయుధాలు అప్పగించారు. ఈ రెండు షాకులతో మావోస్టులు అల్లాడుతుంటే.. తాజాగా ఆశన్న లొంగిపోతున్నారనే వార్త.. వారికి మరో దెబ్బ తగినట్లే అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత, దాదాపు రెండో స్థానంలో చలామణి అవుతున్న మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. 60 మంది ఉద్యమ సహచరులతో కలిసి బుధవారం ఆయన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఎదుట అధికారికంగా లొంగిపోయారు. సీఎం సమక్షంలో వీరంతా తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. మల్లోజుల, ఆయన బృందాన్ని సీఎం ఫడణవీస్ జన జీవన స్రవంతిలోకి ఆహ్వానించారు. తీవ్ర ఒడిదొడుకులతో సాయుధ ఉద్యమం బలహీనపడుతోందన్న ప్రచారం నేపథ్యంలో మావోయిస్టు పార్టీకి ఇది ఇబ్బందికర పరిణామంగా గమనించాలి. మావోయిస్టు పార్టీ వైఖరి సరిగా లేదంటూ కొన్ని రోజులుగా మల్లోజుల బహిరంగ లేఖలు రాస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పార్టీలో దశాబ్దాలుగా జరుగుతున్న తప్పిదాలకు తానే కారణమని పేర్కొంటూ అత్యున్నత నిర్ణాయక కమిటీ పొలిట్‌బ్యూరో నుంచి వైదొలిగారు. తాజాగా ఉద్యమాన్ని పూర్తిగా వదిలిపెట్టి అజ్ఞాతం వీడారు. మల్లోజులపై వందకు పైగా కేసులు ఉన్నాయి.మల్లోజుల సొంత రాష్ట్రం తెలంగాణ. పెద్దపల్లికి చెందిన మల్లోజుల వెంకటయ్య, మధురమ్మ దంపతులకు వేణుగోపాల్‌రావు మూడో సంతానం. తెలంగాణ సాయుధ పోరాటంలో పనిచేసిన తండ్రి నుంచే వేణుగోపాల్, ఆయన రెండో అన్న కోటేశ్వరరావు స్ఫూర్తి పొందారు. చదువు పూర్తయిన అనంతరం తన అన్న పిలుపు మేరకు ఉద్యమంలో ప్రవేశించారు. పార్టీలో ఆయనను అభయ్, సోను, భూపతి, వివేక్ పేర్లతో పిలిచేవారు. వీరిలో పది మంది మహిళలు ఉన్నారు. లొంగిపోయిన వారిపై మొత్తం రూ.50 లక్షల రివార్డు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో మావోయిస్టులు అడవి బాట వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని సూచించారు. మావోయిస్టు కంచుకోట బస్తర్‌లో సైతం గడ్చిరోలి తరహా భారీ ఎత్తున మావోయిస్టులు లొంగిపోయేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టు పార్టీ ఉత్తర బస్తర్ డివిజన్ ఇన్‌ఛార్జి రాజ్ మాన్ సహా పలువురు లొంగిపోనున్నట్లు సమాచారం. బస్తర్ ఐజీ సుందర్ రాజ్, కాంకేర్ ఎస్పీ ఇంద్ర కళ్యాణ్ ఈ మేరకు మావోయిస్టులతో చర్చలు జరుపుతున్నారు.

# పుట్టెడు దుఖంలో ఉన్న ఆడబిడ్డను అవమానిస్తారా...?

(మొదటి పేజీ తరువాయి)

ఎంతో దుఖంలో ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈ సమయంలో కాంగ్రెస్ మంత్రులు మాగంటి సునీతని అవమానించే విధంగా నానా మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. విజ్ఞత మరిచి, విచక్షణ లేకుండా చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ప్రజలు విజ్ఞులని.. మంచి, చెడులని ఆలోచిస్తారని తెలిపారు. మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిపించాలని కోరారు హరీశ్‌రావు.బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి పలువురు నేతలు బీఆర్ఎస్ లోకి చేరారు. హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు, కార్యకర్తలకి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఒక ఆడబిడ్డను ఆశీర్వదించాలనే పలువురు బీజేపీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి కాంగ్రెస్, బీజేపీ ఏం చేసిందనేది ఒకసారి ప్రజలు ఆలోచించాలని సూచించారు. తెలంగాణకి కాంగ్రెస్, బీజేపీ ద్రోహం చేశాయని విమర్శించారు హరీశ్‌రావు. కాంగ్రెస్, బీజేపీలు చెప్పేదొకటి, చేసేదొకటని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ మొహబ్బత్‌కి దుకాణ్ అని అంటారని.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ అంటారని తెలిపారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో జరుగుతోంది ఏమిటి..?.. హైడ్రా పేరిట పేదవారి ఇళ్లు కూలగొట్టడం మొహబ్బత్ దుకాణ్ ఆ..? అని ప్రశ్నించారు. బడా బాబుల ఇళ్లు ఎందుకు కూలగొట్టడం లేదని నిలదీశారు. గరీబోళ్ల ఇల్లు కూలగొట్టి వేల కుటుంబాలను రోడ్డుమీదకి సీఎం రేవంత్‌రెడ్డి తెచ్చారని ధ్వజమెత్తారు. ఈ విషయంలో రేవంత్‌రెడ్డిని రాహుల్ గాంధీ ఎందుకు ప్రశ్నించడం లేదని ఫైర్ అయ్యారు. రాహుల్ గాంధీ బిహార్‌లో ఓటు చోరీ అంటున్నారని... జూబ్లీహిల్స్ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి మాత్రం ఓటు చోరీ చేస్తుంటే రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో రేవంత్‌రెడ్డి ఓటు చోరీ చేయకుండా నిజాయితీగా ఉండాలని చెప్పాల్సిన బాధ్యత రాహుల్ గాంధీకి లేదా అని ప్రశ్నించారు హరీశ్‌రావు. 'జూబ్లీహిల్స్‌లో భర్తను కోల్పోయిన సునీతని ఒడగొట్టాలని.. 20 వేల దొంగ ఓట్లను కాంగ్రెస్ కూడగట్టింది. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని అన్నారు. ప్రతి అక్కకు, చెల్లెకు కాంగ్రెస్ రూ.55,000 బాకీ పడింది. జూబ్లీహిల్స్‌లో మహిళలకు ఒక్కొక్కరికీ రూ.55,000 ఇచ్చి రేవంత్‌రెడ్డి సర్కార్ ఓటు అడగాలన్నారు. వృద్ధులకు రూ.4,000 పెన్షన్ ఇస్తా అన్నారని.. ఇవ్వకుండా మోసం చేశారు. ఒక అవ్వకు, తాతకు రూ.44,000 రేవంత్‌రెడ్డి బాకీపడ్డారు. రేవంత్‌రెడ్డి చేసిందేముంది.. హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టుడు తప్ప అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రతి బస్తీకి బస్తీ దవాఖాన పెట్టారు. హైదరాబాద్‌లో 350 బస్తీ దవాఖానాలని కేసీఆర్ ఏర్పాటు చేశారు. కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాల్లో రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం మందులు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో గర్భిణులు డెలివరీకి పోతే ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ చేసి కేసీఆర్ కిట్ ఇచ్చి ఆటోలో ఇంటికాడ దిగబెట్టాం. రేవంత్‌రెడ్డి సర్కార్‌లో బతుకమ్మ చీరలు, దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు ఇవ్వట్లేదు. కేసీఆర్ హయాంలో 20,000 లీటర్ల నీళ్లు ఉచితంగా ఇస్తే.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి నల్లా బిల్లు వసూలు చేస్తున్నారు. కేసీఆర్ హయాంలో గరీబోళ్లకి నీళ్లు ఉచితంగా ఇచ్చాం. భాగ్యనగరంలో నల్లా సమస్యలు పెరిగాయి. అధికారులు నల్లా బిల్లులు వసూలు చేస్తున్నారు. కాంగ్రెస్‌ని జూబ్లీహిల్స్ ఎన్నికలో ఓడిస్తేనే బుద్ధి వస్తుంది' అని హరీశ్‌రావు విమర్శించారు. 'తెలంగాణలో ఆరు గ్యారెంటీలని 100 రోజుల్లో అమలు చేస్తామని సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో చెప్పించారు. ఇప్పుడు ఆరు గ్యారెంటీలని పూర్తిగా అమలు చేయడం లేదు. జూబ్లీహిల్స్‌లో బీజేపీకి డిపాజిట్ రావడమే కష్టం. భర్తను కోల్పోయిన ఆడబిడ్డను మీరందరూ దీవించాలి. బీజేపీ సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ అంటుంది. కానీ గోదావరి పుష్కరాలకు.. ఆంధ్రప్రదేశ్‌కి రూ.100కోట్లు ఇచ్చి తెలంగాణకు గుండు సున్నా ఇచ్చింది. ఇది సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ ఎలా అవుతోంది..?. తెలంగాణ నీటిని దోపిడీ చేసే బనకచర్ల ప్రాజెక్టుకి బీజేపీ ప్రభుత్వం మద్దతిస్తోంది. అనుమతులు ఇస్తోంది. తెలంగాణకు ఏమి ఇస్తున్నారో బీజేపీ నాయకులు చెప్పాలి. దేశంలో 157 మెడికల్ కాలేజీలు ప్రకటిస్తే ఒక్క మెడికల్ కాలేజీని కూడా తెలంగాణకు ఇవ్వలేదన్నారు. 'తెలంగాణలో బీజేపీకి 8 ఎంపీలను గెలిపిస్తే.. రాష్ట్రానికి మీరు చేసిన మంచి ఇదేనా. గోధుమలకు రూ.2,585, వడ్లకు రూ.2,369 ఇస్తున్నారని... గోధుమలకు ఓ నీతి వడ్లకు మరో నీతి ఉంటుందా..?. అన్నారు. 2014లో బీజేపీ అధికారంలో వచ్చిన నాడు గోధుమలకు, వడ్లకు రూ.1400 మద్దతు ధర ఉండేది. గోధుమలకు మద్దతుధర పెంచి వడ్లకు పెంచకపోవడం తెలంగాణ రైతులకు అన్యాయం చేయడమేనన్నారు. కాంగ్రెస్‌కి నిజాయితీ ఉంటే బాకీ కార్డు పంపిస్తాం. మీరు పడ్డ బాకీని చెల్లించి జూబ్లీహిల్స్‌లో ఓటు అడగాలని పేర్కొన్నారు. తెలంగాణ గొంతు నొక్కడంలో కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే. కేసీఆర్ హయాంలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగింది. ఆడపిల్ల పెళ్లికి కల్యాణలక్ష్మి, గర్భిణులకి కేసీఆర్ కిట్టు ఇచ్చాం. రూ.2000ల పెన్షన్ ఇచ్చి అవ్వాతాతల గౌరవం పెంచాం. షీ టీమ్స్‌తో ఆడపిల్లల భద్రత పెంచాం. కాంగ్రెస్‌వి మొసలి కన్నీళ్లు, ఆపద మొక్కులు తప్పా ప్రజల సంక్షేమం పట్టదని విమర్శించారు.

## హ్యామ్ రోడ్ల నిర్మాణంపై నేటి కేబినేట్‌లో నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. రేపు క్యాబినెట్‌లో తీసుకునే నిర్ణయం రాష్ట్ర రోడ్ల నిర్మాణానికి మైలురాయిగా ఉంటుందని, వచ్చే 30 నెలల్లో తెలంగాణలో 'దేశంలోనే బెస్ట్ రోడ్స్' అనే పేరుని అందించగల నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. రోడ్ల నిర్మాణం దశలవారీగా, హ్యామ్ విధానం ప్రకారం అమలు చేయబడనుంది. అదేవిధంగా, పేద ప్రజలకు కార్పోరేట్ స్థాయి వైద్యం అందించే టిమ్స్ హాస్పిటల్స్ పనుల్లో వేగం పెంచి, అత్యంత త్వరలో ప్రారంభించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు కూడా ఆయన తెలిపారు.

## రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతి

**సంగారెడ్డి అక్టోబర్ 15(జర్నలిస్ట్ వార్త):** ఎదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని కేతావత్ శర్మన్ నాయక్ (55) అనే వ్యక్తి మృతి చెందారు. సంఘటన చిలిపిచెడ్ మండలం సోమక్కపేట్ శిలంపల్లి రోడ్ మార్గంలో జరిగింది. ఎస్సై నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. రహీంగూడ తండా గ్రామపంచాయతీ పరిధిలోని అంబర్య తాండకు చెందిన కేతావత్ శర్మన్ నాయక్ (55) శిలాంపల్లి నుండి తన ఇంటికి వస్తున్న మార్గమధ్యంలో రెండు బైకులు ఢీకొని శర్మన్ నాయక్ అక్కడికక్కడే మృతి చెందారు. సోమక్కపేట గ్రామానికి చెందిన బందేల్లి, గంగిరెద్దుల గూడెంకు చెందిన శ్రీనుకు గాయాలు కాగా ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.మృతున్ని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నర్సింలు తెలిపారు.

## అంతరిక్ష మిషన్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

● రోబోటిక్స్ బిగ్ డేటా వంటివాటి ఉపయోగం: ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ వెల్లడి



**బెంగళూరు,అక్టోబర్ 15(జర్నలిస్ట్ వార్త):** అంతరిక్ష మిషన్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ బిగ్ డేటా వంటివాటిని ఉపయోగించడానికి చర్యలు తీసుకుంటున్నామని ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ అన్నారు. వికసిత భారత్‌కు దూతగా 2040లో భారతీయ వ్యోమగామి చందమామపై అడుగుపెట్టనున్నాడని నారాయణన్ పేర్కొన్నారు. అంతరిక్ష రంగ అభివృద్ధి కోసం ప్రస్తుతం ఇస్రో అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు చేపట్టినట్లు నారాయణన్ వెల్లడించారు. వాటిలో 80వేల కేజీలను మోసుకెళ్లే రాకెట్లను తయారుచేయడం, 2026లో వ్యోమమిత్ర అనే రోబోను అంతరిక్షంలోకి పంపడం, 2035 నాటికి జాతీయ అంతరిక్ష కేంద్రం, చంద్రుడిపై అధ్యయనం కోసం వీనస్ ఆర్బిటర్ మిష ఏర్పాటు వంటి లక్ష్యాలను ఏర్పరుచుకున్నామన్నారు. 2027లో చేపట్టబోయే మానవ సహిత గగనయాత్ర మిషన్ ట్రాక్‌లో ఉందని వెల్లడించారు. 2040 నాటికి తొలి మానవసహిత జాబిల్లి యాత్ర చేపట్టాలని ప్రధాని దిశానిర్దేశం చేశారని..అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారేందుకు అంతరిక్ష కార్యక్రమంలో ఈ యాత్ర కీలకపాత్ర పోషిస్తుందన్నారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇస్రో ప్రణాళికలను పంచుకున్న వి. నారాయణన్ గగన్‌యాన్‌లో భాగంగా తాము మరిన్ని ప్రయోగాలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. చంద్రుడి ఉపరితల నమూనాలను భూమికి తీసుకొచ్చేందుకు 2027లో ప్రతిష్ఠాత్మక చంద్రయాన్-4 ప్రయోగాన్ని చేపట్టనున్నట్లు వివరించారు. కొన్నేళ్ల క్రితం అంతరిక్షరంగంలో రెండు లేక మూడు స్టార్టప్‌లు మాత్రమే ఉండేవని.. ప్రస్తుతం ఉపగ్రహ తయారీ, ప్రయోగ సేవలు, అంతరిక్ష ఆధారిత డేటా విశ్లేషణలపై అధ్యయం కోసం 300 కంటే ఎక్కువ స్టార్టప్‌లు పనిచేస్తున్నాయని ఇస్రో చీఫ్ అన్నారు. వ్యవసాయం, విపత్తు ప్రతిస్పందన, నిర్వహణ, టెలికమ్యూనికేషన్, రియల్-టైమ్ రైలు, వాహన పర్యవేక్షణలో ఉపగ్రహ ఆధారిత అనువర్తనాల అధ్యయనానికి ఇవి ఉపయోగపడతాయన్నారు.

# నేడు శ్రీశైలంలో భ్రమరాంబ మల్లికార్జునిడిని దర్శించుకుంటా...

(మొదటి పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో కర్నూలు జిల్లా పర్యటనపై ప్రధాని మోదీ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఆసక్తికర ట్వీట్ పెట్టారు. అచ్చమైన తెలుగులో ఈ ట్వీట్ పెట్టారు ప్రధాని మోదీ. ఆంధ్రప్రదేశ్‌లో 'రేపు అంటే అక్టోబర్ 16వ తేదీన పర్యటిస్తాను. శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేస్తాను. ఆ తర్వాత కర్నూలులో రూ.13, 400 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటాను. ఈ పనులు విద్యుత్, రైల్వేలు, పెట్రోలియం, రక్షణ, పరిశ్రమలతో పాటు మరిన్ని రంగాలకు సంబంధించినవి ఉన్నాయని ప్రధాని మోదీ తన ట్వీట్ ద్వారా వెల్లడించారు.

## వందేభారత్ 4.0 వర్షన్ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

కానుందని వెల్లడించారు.సీఐఐ ఇంటర్నేషనల్ రైల్ కాన్ఫరెన్స్‌లో కేంద్రమంత్రి మాట్లాడారు. మోదీ రైల్వేల అభివృద్ధిపై బలంగా దృష్టి సారించిందని వెల్లడించారు.11 ఏళ్లలో 35,000 కిలోమీటర్ల మేర రైల్వే ట్రాక్‌ల నిర్మాణం జరిగిందని చెప్పారు. జపాన్ బుల్లెట్ రైల్ నెట్‌వర్క్ మాదిరిగానే హైస్పీడ్ ప్యాసింజర్ రైల్ కారిడార్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు చెప్పారు. గరిష్ఠంగా గంటకు 350 కి.మీ వేగంతో రైలు ప్రయాణించేలా వాటి డిజైన్ ఉంటుందని తెలిపారు.

## జూబ్లీహిల్స్ బిజెపి అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నామినేషన్ పక్రియ మరికొద్ది రోజుల్లో ముగియనుంది. దాంతో ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత.. బుధవారం నామినేషన్ దాఖలు చేసారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడిలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరోవైపు అధికార కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్.. ఎన్ని కల ప్రచారంలో ఇప్పటికే దూసుకు పోతున్నారు. 2023 ఏడాది చివరిలో జరిగిన తెలంగాణ అసెం బ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్ బరిలో దిగి గెలిచారు. అయితే అనారోగ్యం కారణంగా ఆయన ఇటీవల మరణించారు. ఇక బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి తాజాగా ప్రకటించింది. ఉప ఎన్నిక పోలింగ్ నవంబర్ 11వ తేదీన జరగను ంది. ఈ ఎన్నికల ఫలితాలు నవంబర్ 14వ తేదీన వెల్లడి కానున్నాయి. అయితే జూబ్లీహిల్స్ ఓటరు ఏ పార్టీకి పట్టం కట్టాడనేది ఆ రోజుతో తెలిపోనుంది. అనారోగ్య కారణాలతో ఈ ఏడాది జూన్ 8న బిఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూశారు. ఆయన మృతితో ఉప ఎన్నిక అనివార్యమైంది.

## పదేళ్ల అభివృద్ధికి..రెండేళ్ల అరాచకానికి మధ్య పోరు

(మొదటి పేజీ తరువాయి)

కోరుకుంటున్నారన్నారు. మూతపడుతున్న బస్తీ దావఖానాలు, ఉచిత తాగునీరు ఆగిపోతున్న విషయాలు ప్రజలందరూ చూస్తున్నారని.. కాంగ్రెస్ పార్టీ ఒక ఇల్లు కూడా హైదరాబాదులో కట్టలేదని.. కేసీఆర్ కట్టిన హైదరాబాద్‌లో కట్టిన లక్ష ఇళ్లు, ఇచ్చిన ఇళ్ల పట్టాలు, ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అన్నీ కూడా హైదరాబాద్ నగర ప్రజలకు గుర్తుకు వస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ చేతిలో మోసపోయిన మైనార్టీలకు ఈ ఎన్నిక ఒక అవకాశంగా భావిస్తున్నారని.. ప్రభుత్వంలో ఒక్క మైనార్టీకి కూడా అవకాశం ఇవ్వకుండా దారుణంగా వారిని అవమానపరిచిన మైనార్టీలు, ఈ ఎన్నికను రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పడానికి ఒక అవకాశంగా భావిస్తున్నట్లుగా చెప్పారు. తమకు ఇచ్చిన బీసీ డిక్లరేషన్, రిజర్వేషన్లు అన్నీ మోసమని, గుణపాఠం చెప్పడానికి రాష్ట్రవ్యాప్తంగా బీసీలు సిద్ధంగా ఉన్నారని.. దళితబంధు, అభయహస్తం అని చెప్పి మోసం చేసిన దళితులు కూడా ఆగ్రహంతో ఉన్నారని.. తమ అభ్యర్థికి అన్ని వర్గాల నుంచి మద్దతు వెల్లువెత్తుతున్నదని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ ఆధ్వర్యంలో మరోసారి పాలన రావడానికి, హైదరాబాద్ నగరంలో జరుగుతున్న ఈ ఉప ఎన్నిక పునాది కాబోతున్నదన్నారు.

## కాందహార్‌లో పాక్ వైమానిక దాడులు

**/ఇస్లామాబాద్,అక్టోబర్ 15(జర్నలిస్ట్ వార్త):** కాందహార్ ప్రావిన్స్‌లోని పాకిస్థాన్-ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పాకిస్థాన్ దళాలు జరిపిన వైమానిక దాడుల్లో 12మందికి పైగా ఆఫ్ఘన్ పౌరులు మృతి చెందినట్టు తెలుస్తోంది. ఇది తాలిబన్ - పాకిస్థాన్ దళాల మధ్య తాజాగా కాల్పులకు దారితీశాయి. దీంతో రెండు పాత మిత్రదేశాల మధ్య వైరం తీవ్రతరమైంది. దీనిపై ఇరుపక్షాలూ ఒకరిపై మరొకరు ఆరోపణలు గుప్పించుకున్నాయి. బుధవారం ఉదయం, కాందహార్‌లోని స్పిన్ బోల్డాక్ జిల్లాపై పాకిస్థాన్ దళాలు తేలికపాటి, భారీ ఆయుధాలతో దాడులు ప్రారంభించాయి. ఫలితంగా 12మందికి పైగా ఆఫ్ఘాన్ పౌరులు అమరులయ్యారు. కనీసం 100 మంది గాయపడ్డారని ఆఫ్ఘన్ ప్రభుత్వ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ తెలిపారు. పాకిస్థాన్ చేసిన దాడి.. ఒక నివాస భవనాన్ని తాకడంతో ఆ ఇంట్లో చాలామంది పిల్లలు చనిపోయినట్టు తెలుస్తోంది. గాయపడ్డ వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. దీంతో ఆఫ్ఘన్ దళాలు కూడా ప్రతీకార చర్యకు దిగాయి. కాగా, పాకిస్థాన్ జరిపిన దాడిలో 15మంది పౌరులు మరణించారని ంఈఖ వార్తా సంస్థ నివేదించింది. గాయపడిన వారిలో 80మందికి పైగా మహిళలు, పిల్లలు ఉన్నార ని తెలిపింది. బుధవారం నాడు కాబూల్ శివార్లలో ఒక ఇంధన ట్యాంకర్ పేలింది. ఫలితంగా, భారీ అగ్నిప్రమాదం సంభవించిందని టోలోన్యూస్ నివేదిం చింది. వివాదం తగ్గే సూచనలు కనిపించకపోవడం, పాకిస్థాన్ మంత్రులను చర్చలకు ఆఫ్ఘనిస్తాన్ అనుమతించకపోవడంతో మధ్యవర్తులుగా వ్యవహరించ డానికి ఖతార్, సౌదీ అరేబియాకు ఇస్లామాబాద్ ఫోన్ చేసినట్టు తెలుస్తోంది.

# జూబ్లీహిల్స్‌లో సాకులు వెదుకుతున్న బిఆర్ఎస్

## - ఓటమి భయంతో ముందే కుంటిసాకులు: శ్రీధర్ బాబు

**హైదరాబాద్,అక్టోబర్ 15(జర్నలిస్ట్ వార్త):**జూబ్లీహిల్స్‌లో ఓటమి భయంతో బిఆర్ఎస్ రకరకాల ప్రచారాలు చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.దేశంలో ఓట్ల చోరీ జరిగిందని చెప్పిందే కాంగ్రెస్ అని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓడిపోతామనే బీఆర్ఎస్ నేతలు సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ఓటర్ల జాబితా తయారు చేసిందే గత బీఆర్ఎస్ ప్రభుత్వమని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది రామరాజ్యమని అభివర్ణించారు. తెలంగాణలోని ప్రజలందరూ రామరాజ్యాన్ని కోరుకుంటున్నారని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఇదిలావుంటే మంత్రుల మధ్య వివాదాలపై మంత్రి శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రుల మధ్య వివాదాలు లేవని స్పష్టం చేశారు. తాను సీనియర్ కాంగ్రెస్ వాదినని చెప్పుకొచ్చారు. తనకి నీచ రాజకీయం చేసే శక్తి లేదు.. యుక్తి అంతకన్నా లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. తాను పార్టీని నమ్ముకొని ఉన్నానని క్లారిటీ ఇచ్చారు. హైదరాబాద్‌లో బుధవారం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. పార్టీని నమ్ముకోకుండా అటు, ఇటు పోయే వ్యక్తిని తాను కాదని స్పష్టం చేశారు. తాను పార్టీని బలోపేతం చేసే వ్యక్తినని చెప్పుకొచ్చారు.

# బైకును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు...

## రిటైర్డ్ ఉద్యోగికి తీవ్రగాయాలు

### పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి బండారి కొమురయ్య.



**హుజురాబాద్/అక్టోబర్15 (జర్నలిస్ట్ వార్త):**
హుజురాబాద్ మండలంపరకాల క్రాస్ రోడ్డులో ఆర్టీసీ బస్సు బైకును ఢీకొట్టగా, వ్యక్తి బస్సుకింద పడి తీవ్ర గాయలతో ప్రాణాలతో బయటపడిన ఘటన హుజురాబాద్ పట్టణంలోని పరకాల క్రాస్ వద్ద బుధవారం రోజు జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హుజురాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి బండారి కొమురయ్య పరకాల క్రాస్ వద్దకు చేరుకోగా, వరంగల్ నుంచి హుజురాబాద్ కు వస్తున్న వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొట్టింది. బస్సు వెనుక టైర్లకింద బైక్ పడిపోగా, కొమురయ్య బస్సు రెండు టైర్ల నడుమ ఖాళీ భాగంలో ఇరుక్కుపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే ఇరుక్కున్న బాధితుడిని బయటకు తీసి, 108 కు సమాచారమివ్వగా, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, కొమురయ్య తలకి, కాలికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.







## బీసీ సోదరులు మరో స్వతంత్ర పోరాటానికి సిద్ధం కావాలి

### సిపిఐ జిల్లా సమితి సభ్యులు పనాస ప్రసాద్




**వర్ధన్నపేట/అక్టోబర్ 15(జర్నలిస్ట్ వార్త):**
బీసీలను దశాబ్దాలుగా పాలకులు మోసం చేస్తున్నారని ఇప్పటికైనా బీసీ రిజర్వేషన్ల సాధన కోసం మరో స్వతంత్ర పోరాటంలా ఉద్యమాలను ఉధృతం చేయాలని పనాస ప్రసాద్ బీసీ సమాజానికి పిలుపునిచ్చారు. బుధవారం సిపిఐ పార్టీ మండల సమితి ఆధ్వర్యంలో వర్ధన్నపేట ప్రధాన రహదారిపై అంబేద్కర్ సెంటర్లో రిజర్వేషన్ల సాధన కోసం రాస్తారోకో నిర్వహించారు ఈ సందర్భంగా పనాస ప్రసాద్ మాట్లాడుతూ బీసీలను పాలకులందరూ పదేపదే మోసం చేస్తున్నారని 56% పైగా ఉన్న బీసీలకు కేవలం విద్యా ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ మోసం చేస్తున్నారని అన్నారు ఐదు శాతం కూడా లేని అగ్రవర్ణాలకు 10 శాతం ఈ డబ్ల్యూ ఎస్ ద్వారా రిజర్వేషన్లను ఇస్తున్న మోడీ ప్రభుత్వం బీసీలను ఎందుకు పట్టించుకోవట్లేదని నిలదీశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇప్పటికైనా దేశవ్యాప్తంగా జనగణన. కులగనన చేసి బీసీలకు దామాషా పద్ధతి ప్రకారం రిజర్వేషన్లు చట్టసభలతో పాటు విద్య ఉద్యోగ రంగాల్లో కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కులగనన లో బీసీల వాట 56% తేలిందని వీరందరికీ రిజర్వేషన్ ఇవ్వడానికి రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో రిజర్వేషన్ అంశాన్ని చేర్చాలని సిపిఐ పార్టీగా డిమాండ్ చేస్తున్నామన్నారు, లేదంటే రానున్న రోజుల్లో బీసీ సమాజాన్ని ఏకం చేసి మేమెంతో మాకంత వాటా అని పోరాటాలను తీవ్రం చేస్తామని హెచ్చరించారు ఈ రాస్తారోకోలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ల్యాదెల్ల శరత్,బొట్ల శ్రీనివాస్, ఆరెల్లి ప్రభాకర్ మండల సిపిఐ సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి సాయిలు నాయకులు లొంక ఐలయ్య, చెక్క గణేష్, ఆరేల్లి యాకయ్య, ఐలపాక నవాబు, పెద్దపులి ఎల్లయ్య, పోచంపల్లి ఎల్లయ్య మెరుగు ఆనందం,కొండేటి రామకృష్ణ తదితరులు పాల్గొని బీసీలకు రిజర్వేషన్ ఇవ్వాలని నినదించారు

## పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు వేయించాలి



**రాయపర్తి/అక్టోబర్ 15(జర్నలిస్ట్ వార్త):**పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు వేయించాలని మండల వెటర్నరీ డాక్టర్ శృతి అన్నారు.బుధవారం మండలంలోని కాట్రపల్లి గ్రామంలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభించి గాలి కుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువుల నోరు,గిట్టల మధ్య పుండ్లు రావడంతో పాటు జ్వయం ఉండడం గాలి కుంటు వ్యాధి లక్షణాలు అన్నారు.వ్యాధి సోకిన పాడి పశువులలో పాల ఉత్పత్తి తగ్గుతుందని అన్నారు.వ్యాధి పశువులకు రావడం కంటే ముందుగానే నివారణ టీకాలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య,గణేష్,తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



**రాయపర్తి/అక్టోబర్ 15(జర్నలిస్ట్ వార్త):**వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని తిర్మలాయపల్లి గ్రామానికి ముద్రబోయిన రామనర్సమ్మ ఇటివల అకస్మాత్తుగా మరణించింది.బుధవారం బాధిత కుటుంబాన్ని గ్రామానికి చెందిన కసరబోయిన రాజు యాదవ్ పరామర్శించి 50 కేజీల బియ్యం,5 లీటర్ల నూనె క్యాన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో చిక్కుడు శ్రీనివాస్, దొంతరబోయిన రాజయ్య, ముద్రబోయిన ఉప్పలయ్య, ముద్రబోయిన రమేష్, అన్నెపు వెంకన్న, వశపాక ప్రశాంత్,సంకరబోయిన మొగిలి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛభారత్ - స్వచ్ఛ కళాశాల

### ప్రొఫెసర్ మల్లం నవీన్




**నర్సంపేట /అక్టోబర్15 (జర్నలిస్ట్ వార్త):**ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ నర్సంపేటలో ఎన్ఎస్ఎస్,ఎన్సిసి విద్యార్థుల ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ స్వచ్ఛ కళాశాల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ గాంధీజీ స్ఫూర్తితో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన స్వచ్ఛ భారత్ లో భాగంగా స్వచ్ఛ కళాశాల కార్యక్రమాన్ని ప్రారంభించామని ఇందులో భాగంగా ప్రతి విద్యార్థులు అధ్యాపకులు,కళాశాల సిబ్బంది తమ యొక్క పరిసరాలను,తరగతి గదులను మాసంలో ఒక్కసారైనా శుద్ధికరించుకోవాలన్నారు. తమ ఇంటి పరిసరాలను, ఊరు ని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇందుకుగాను విద్యార్థులు తమ గ్రామాలలో చైతన్యాన్ని కలిగించాలని తెలిపారు. కళాశాల తెలుగులో పెరిగిన పిచ్చి మొక్కలను,తరగతి గదులను శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ జిల్లా బాధ్యులు డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ కళాశాల స్వచ్ఛత అందరి బాధ్యత అని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్సిసి డాక్టర్ రాజీరు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య అకాడమీ కోఆర్డినేటర్ డాక్టర్ కందాల సత్యనారాయణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.కమలాకర్ అధ్యాపకులు డాక్టర్ ఎమ్.సోమయ్య, ఎస్ రజిత, రుద్రాణి, డాక్టర్ బి.గాయత్రి, డాక్టర్ బద్రు భూక్య, డాక్టర్ పూర్ణచందర్, వీరన్న, పిడి రమేష్, గ్లోరీ, మాధవి, నిజాం, దేవేందర్, రాకేష్, దివ్య, సతీష్, స్వప్న, మరియు విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు

## రెవెన్యూ శాఖకు జి.పి.ఓ లు కళ్ళు లాంటి వారు





### :జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి/అక్టోబర్15 (జర్నలిస్ట్ వార్త):**
రెవెన్యూ శాఖకు జి.పి.ఓ లు కళ్ళు లాంటి వారు అని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. బుధవారం ఐడిఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నూతనంగా నియమితులైన జి.పి.ఓ లకు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూ భారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై విధుల పట్ల జి.పి.ఓ లకు మార్గదర్శక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ విధులు అత్యంత కీలకమని, చాలా బాధ్యతాయుతమైనటువంటి జి.పి.ఓ లు గ్రామాల్లో ప్రభుత్వానికి కళ్లు, చెవులు లాంటి వారని తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండటం వారి ప్రధాన బాధ్యతని తెలిపారు. భూముల సమస్యలు, రైతుల ఇబ్బందులు, ప్రజల అభ్యర్థనలను మొదటగా గుర్తించేది జి.పి.ఓ లేనని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టంను ప్రవేశపెట్టిందని, ప్రతి జి.పి.ఓ ఈ చట్టంపై పూర్తి అవగాహనతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 54 వేల దరఖాస్తులు వచ్చాయని, వాటి పరిశీలనలో జి.పి.ఓ లు కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా పరిష్కరించాలన్నారు.గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరైనా అవినీతి లేదా అక్రమాలకు పాల్పడితే, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం మన కర్తవ్యమని గుర్తుంచుకోవాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.జి.పి.ఓ లు తమ పనిని సేవా దృక్పథంతో, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వర్తిస్తే, భూ భారతి కార్యక్రమం విజయవంతమవుతుందని కలెక్టర్ రాహుల్ శర్మ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డిఓ రవి, ట్రైని డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, భూపాలపల్లి తహసిల్దార్ శ్రీనివాసులు, జిపివోలు తదితరులు పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీ...

# నిధులు గోల్ మాల్...

## 2 కోట్ల జనరల్ ఫండ్ స్వాహా..? ని'చ్చింతా'గా బదిలీ...

### సూత్రధారులు బదిలీ కమిషనర్ వేణు, అకౌంటెంట్ ఏ వి

**వైరా/అక్టోబర్15(జర్నలిస్ట్ వార్త):**
వైరా మున్సిపాలిటీ అవినీతి అక్రమాలకు హబ్ గా మారింది.!అధికారులు ఎవరికి అందినంతవారు వారి చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు...! అవినీతి అక్రమాలు కు పాల్పడిన అధికారి ని'చ్చింతా' గా బదిలీ అయి ఊపిరి పీల్చుకుంటున్నాడని.. కానీ ప్రస్తుతం ఆ అవినీతి ఉచ్చు మెడకు చుట్టుకుంది అనే విషయంపై సర్వత్ర చర్చ జరుగుతుంది... వైరా మున్సిపాలిటీ కి చెందిన ప్రభుత్వ సొమ్మును అధికారులు సిబ్బంది కొందరు అవినీతికి పాల్పడి దర్జాగా సొమ్ము చేసుకున్నారని వస్తున్న వార్తలు వెనక నిజాలు నిగ్గు తేల్చనున్నాయి.... తీగ కదిపితే..డొంక కదులుతుంది అన్న చందంగా వైరా మున్సిపాలిటీలో ప్రస్తుతం తీరు నెలకొంది... ప్రభుత్వ సొమ్ము ప్రజల నుండి నాకేసిన ప్రతి ఒక్క నాలుక... నోరు తెరిచి.. మా అవినీతి బాగోతం ఎక్కడ బయట పడుతుందో అనే ఆందోళనలో ఉన్నారనే విషయం స్పష్టం అవుతుంది... వైరా మున్సిపాలిటీలో రెండు కోట్ల జనరల్ ఫండ్ స్వాహా విషయంలో నిజాలు త్వరలో నిగ్గు తేలనున్నాయి... ఎవరు సూత్రధారి,పాత్రధారులు ఎవరనే.. చర్చ జరుగుతోంది... మొన్నటి వరకు వైరా కమిషనర్ గా పనిచేసిన చింతా వేణు అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సూత్రధారిగా ఆయన పాత్రధారులుగా ఏ.వి.ఆర్ తో పాటు మరో ముగ్గురు ప్రభుత్వ సిబ్బంది. వారితో ఒక ఇద్దరు అవుట్సోర్సింగ్ ఉద్యోగులు కూడా జతకట్టి అవినీతికి పాల్పడి అక్రమంగా సొమ్మును స్వాహా చేశారనే విషయంపై.. విమర్శలు వినిపిస్తున్నాయి... మున్సిపాలిటీ శాఖకు చెందిన వరంగల్ అధికారి ఆర్ డి ఎం ఏ



మంగళవారం వైరా మున్సిపాలిటీ ని అకస్మీకంగా సందర్శించారు.. అనంతరం రెండు గంటల పాటు మున్సిపాలిటీ కమిషనర్ తో పాటు సిబ్బందితో విచారణ జరిపారు. జనరల్ ఫండ్ రెండు కోట్ల లో ఎవరికివారు ఇష్టం వచ్చినట్లుగా సెల్ఫ్ చెక్కులు కూడా రాసి దోచుకున్న అంశంపై విచారణ చేపట్టారు. రెండు మూడు గంటల పాటు జరిగిన అధికారి చేపట్టిన విచారణ పర్వంలో.. అవినీతి జలగలు ఒక్కొక్కరుగా బయటకు వచ్చినట్లు తెలుస్తోంది.. విచారణ అధికారి సైతం వైరా మున్సిపాలిటీలో జనరల్ ఫండ్ విషయంలో అవకతవకలు జరిగిన విషయంపై వస్తున్న వార్తలు యదార్థమే అని తేల్చి చెప్పారు. దాదాపు 60 లక్షలు వరకు అవినీతి జరిగిన విషయంపై కొంత అవగాహనకు వచ్చినట్లు కూడా తెలుస్తోంది.. మున్సిపాలిటీలో అకౌంటెంట్గా పని చేస్తున్న ఏవీఆర్ సెల్ఫ్ చెక్కులు కూడా డ్రా చేసినట్లు విచారణలో బట్టబయలైంది... ఉద్యోగి సెల్ఫ్‌గా చెక్కులను రాసేందుకు కానీ డ్రా చేసేందుకు గాని అధికారం లేదనే విషయాన్ని విచారణ అధికారి తేల్చి చెప్పారు.. మరింత నిజాలు నిగ్గు తేల్చాలని... వైరా నూతన కమిషనర్ గురు లింగం కి జనరల్ ఫండ్ నిధుల విషయంలో పూర్తిస్థాయి నివేదికను తనకు సమర్పించాలని ఆదేశించారు.అవినీతి చేసిన ఎవరిపైన ఉపేక్షించేది లేదని సదరు విచారణ అధికారి తేల్చి చెప్పారు.. ఏదేమైనాప్పటికీ జనరల్ ఫండ్ స్వాహా చేసిన సూత్రధారులు పాత్రధారుల విషయంలో.. అతి త్వరలో స్పష్టమైన క్లారిటీ వచ్చే అవకాశం ఉందనే విషయం స్పష్టం అవుతుంది.

# నియోజకవర్గంలోని అన్ని ఆలయాల అభివృద్ధి జరగాలి

## ...ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండాహద్దులు నాటాలి

### ... అక్రమణలను తొలగించాలి, అవసరమైతే కోర్టుకు వెళ్లాలి... స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**స్టేషన్ ఘన్పూర్/అక్టోబర్15 (జర్నలిస్ట్ వార్త) :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని అన్ని ఆలయాల ను అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాల్లన్నదే తన ఆలోచనఅని మాజీ ఉప ముఖ్య మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో గల ప్రధాన ఆలయల పైన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎండోమెంట్ జాయింట్ కమిషనర్ రామ క్రిష్ణ రావులతో కలిసి ఆలయ కమిటీ చైర్మన్లు, ఈఓలు, రెవిన్యూ, ఇంజనీరింగ్ అధికారులతో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించా రు.ఈసందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడు తూ నియోజకవర్గ పరిధిలో గల అన్ని దేవస్థానాల అభివృద్ధి కి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఎండోమెంట్ అధికారులకు సూచించారు. చిల్పూర్ - బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయం,స్టేషన్ఘనపూర్ - తిరుమలనాథ స్వామి ఆలయం, చిన్న పెండ్యాల- లక్ష్మి నరసింహ స్వామి ఆలయం,ఆలయాలతో పాటు సంబందించి ఆలయాల అభివృద్ధిపైన క్షుణ్ణంగారివ్యూ నిర్వహించారు.చిల్పూర్ దేవస్థాన అభివృద్ధికి సంబం దించి ప్రత్యేకమాస్టర్ ప్లాన్ తయారుచేయాలని,అందు కు అవసరమైన నిధుల మంజూరుకు



ముఖ్యమంత్రిని కలిసి విజ్ఞప్తి చేస్తానని పేర్కొన్నారు.చిన్న పెండ్యాల లక్ష్మి నర్సింహా స్వామి దేవస్థానంకి సంబందించి రోడ్, విద్యుత్ సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందని, అలాగే ఆలయం మారమ్మత్తు చేపట్టాలని సూచించారు.అన్ని ఆలయాల వద్ద తాగునీరు, టాయి లెట్స్ లాంటి కనీస మౌలిక వసతులు ఉండాలని తెలి పారు.దేవాలయాలభూములు అన్యాక్రాంతం కావద్దని, దేవస్థానం పేరు మీదున్న అన్నిభూముల సర్వే జరిపిం చి,హద్దులు ఏర్పాటుచేసి పక్కాగా రికార్డ్ లు నమోదు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. దేవాలయాల భూములను



కాపాడాల్సిన బాధ్యత మనదేనని, ఎట్టి పరిస్థితుల్లో అక్రమణలను ఉపేక్షించ వద్దని స్పష్టం చేశారు. ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా హద్దులు నాటాలని,అక్రమణలను తొల గించాలని అవసరమైతే కోర్టుకు వెళ్లాలని అన్నారు. ఈసమావేశం లో జనగాం, స్టేషన్ ఘనపూర్ ఆర్డీఓలు గోపీరామ్, వెంకన్న,చిల్పూర్ గుట్ట శ్రీ బుగులు వెంకటే శ్వర స్వామి దేవాలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, దేవాలయం కార్యనిర్వహణాధికారి బి లక్ష్మీ ప్రసన్న, స్టేషన్ ఘన్పూ ర్, లింగాలఘన పూర్, జఫర్ గడ్, రఘునాథపల్లి మండలాల తహసీల్దార్ లు, ఈఓలు, తదితర అధికారులు పాల్గొన్నారు.

## రోగి కి పునర్జన్మనిచ్చిన సత్తుపల్లి వైద్యులు..



**సత్తుపల్లి/అక్టోబర్ 15(జర్నలిస్ట్ వార్త):** ఆరోగ్యం విషమించి సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన ఓ రోగికి సత్తుపల్లి ప్రభుత్వ వైద్యులు మెరుగైన చికిత్స అందించి ప్రాణం పోశారు. కిష్టారం గ్రామానికి చెందిన వేముల జగన్(35) గత నెల 19న మల్టి ఆర్గాన్ డ్యామేజ్ తో ఆసుపత్రి లో చేరారు. బీపీ,గుండె,కిడ్నీ సమస్యలతో బాధపడుచున్న జగన్ ను అనుక్షణం పర్యవేక్షిస్తూ వైద్యం అందించడం తో కోలుకున్నారు. ఈ సందర్భంగా సుపరిండెంట్ వెంకటేశ్వర్లు, వైద్య బృందాన్ని సన్మానించారు.

## పామ్ ఆయిల్ మొక్కల విషయంలో ప్రభుత్వం వినూత్న నిర్ణయం.. ఖమ్మం నుంచి అమలు...!



**ఖమ్మం బ్యూరో/అక్టోబర్15(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ప్రభుత్వం పచ్చదనంతో పాటు ఆదాయం కోసం వినూత్న నిర్ణయం తీసుకుంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆలోచనతో ప్రభుత్వ స్థలాలు, రహదారులు, బీడు భూముల్లో ఆయిల్ ఫామ్ మొక్కలు పెంచి పచ్చదనంతో పాటు ఆదాయం కూడా పొందేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తుంది. ఉమ్మడి ఖమ్మం మోడల్ గా తీసుకొని అన్ని ప్రభుత్వ విభాగాలలోని ఖాళీ స్థలాలను గుర్తిస్తున్నారు. ఈ స్థలాలలో ఆయిల్ ఫామ్ మొక్కలు నాటడం కూడా అన్ని ప్రభుత్వ శాఖలకు ఆదాయం లభించనుంది.

## విద్యార్థులను బయటకు పంపితే కఠిన చర్యలు: డిప్యూటీ సీఎం



**సత్తుపల్లి/అక్టోబర్ 15(జర్నలిస్ట్ వార్త):** బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (బి ఏ ఎస్) పథకం బకాయిల కోసం తరగతి గదుల నుంచి పిల్లలను బయటకు పంపితే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క హెచ్చరించారు. ఖమ్మం జిల్లాలోని కలెక్టరేట్లో హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లోఆయన మాట్లాడుతూ ప్రవేట్ పాఠశాల యాజమాన్యాలు పిల్లలను ఇబ్బంది పెట్టడానికి వీలులేదని అన్నారు. బకాయిల కోసం పిల్లల్ని ఎట్టి పరిస్థితుల్లో బయటకి పంపకూడదని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్ లో కలెక్టర్ అనుదీప్ అదనపు కలెక్టర్ శ్రీజ పాల్గొన్నారు.

## ఎజిఎఫ్ రాష్ట్రస్థాయి కబడ్డి పోటీలకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఎంపిక.




**వేలేరు/అక్టోబర్15(జర్నలిస్ట్ వార్త)::** ములుగులో జిల్లా జాకారంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఎస్ జి ఎఫ్ అండర్ 14 బాల, బాలికల విభాగంలో జరిగిన కబడ్డీ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వేలేరు మండలకేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు ఎస్ రోహన్. ఎల్ నందిని రాష్ట్రస్థాయి కబడ్డి పోటీలకు ఎంపికై ఈనెల 16,17,18 తేదీలలో సంగారెడ్డి జిల్లా పటాన్ చెరులో జరిగే పోటీలలో గెలుపొంది పాఠశాలకు, మీతల్లి దండ్రులకు, గ్రామానికి మంచి గుర్తింపు తేవాలని అలాగే మీనిజ జీవితంలో రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి క్రీడలలో పాల్గొని విజేతలై అత్యున్నత స్థాయిలో ఉండి ఆదర్శవంతమైన జీవితాలను గడుపాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం సత్తయ్య ఫిజికల్ డైరెక్టర్ (పిడి) ఎ సునీల్ పాఠశాల సిబ్బంది తదితరులు ఎస్ రోహన్, ఎల్ నందిని ని అభినందించారు.

## భాషా పార్థివదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లిన బంధువులు..



**తల్లాడ/అక్టోబర్15(జర్నలిస్ట్ వార్త):** గుండెపోటుతో మృతి చెందిన పారిశ్రామికవేత్త షేక్ భాషా పార్థివదేహాన్ని బంధువులు తమ స్వగ్రామమైన చింతకాని మండలం కోదుమూరు గ్రామానికి బుధవారంతీసుకెళ్లారు. ఈ సందర్భంగా తల్లాడ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి బంధువులు, స్నేహితులు ఆయనకు కడసారి వీడ్కోలు పలికారు. ప్రతి ఒక్కరూ ఆయనతో ఉన్న మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు ప్రతి ఒక్కరూ హాజరై ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. తల్లాడ పట్టణంలో మృతదేహాన్ని ఊరేగిస్తూ ఆయనకు జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సోదరులు మౌలానా జానీ , వార్త విలేకర్ బవదూర్, ఆసిఫ్,ముస్లిం మత పెద్దలు, షేక్ మెహరాజ్, బిగ్ నాగుల మేర మూసాఖాన్ ,నాయకులు పెరిక నాగేశ్వరరావు, నారపోగు ప్రసాద్ బాబు, పాస్టర్ కెవి ఇజ్రాయిల్, నార పోగు రమేష్ బాబు ,తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలో చేరిన రావుల వెంకట రమేష్ గౌడ్



**వరంగల్ బ్యూరో/అక్టోబర్15,(జర్నలిస్ట్ వార్త) :** గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ పార్టీనేత టిపిసిసి గీత సెల్ సెక్రటరీ రావుల వెంకట రమేష్ గౌడ్ బుధవారం బి ఆర్ ఎస్ పార్టీ లో చేరగా మాజీ మంత్రి ఎర్ర బెల్లి దయాకర్ రావు కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలో పూర్తిగా విఫలమైందని గుర్తు చేశారు. కెసిఆర్ చేసిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమి లేదని స్పష్టం చేశారు. అందుకే ప్రజలు కేసీఆర్ ను కోరుకుంటున్నారని బిఆర్ఎస్ పార్టీ కి రోజు రోజుకు ఆదరణ పెరుగుతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.హనుమకొండ రాంనగర్ లోని ఆయన స్వగృహంలో తో పాటు పలువురు బిఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ ప్రెసిడెంట్ భూక్య సాంబయ్య నాయక్, 55వ డివిజన్ ప్రెసిడెంట్ అటికం రవీందర్ గౌడ్, మాజీ జెడ్పిటిసి మార్గం బిక్షపతి, మాజీ ఎంపీపీ అప్పారావు, వర్ధన్నపేట మండల అధ్యక్షులు తూళ్ళ కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.



## తాటికొండలో ఘనంగా పోషణ మాస మహోత్సవాలు





**స్టేషన్ ఘన్పూర్/అక్టోబర్15 (జర్నలిస్ట్ వార్త) :** మండలంలోని తాటికొండ గ్రామంలో 1, 2, 3, 4 వ అంగన్వాడి సెంటర్ల ఆధ్వర్యంలో బుధవారం పోషణ మాస మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అంగ న్వాడి సెంటర్ల ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా ఆరోగ్యకరమైన వంటకాలపై సమావేశం నిర్వ హించి, పౌష్టికా అనుబంధ ఆహారాల వంటకాల పోటీ లు నిర్వహించారు. అంగన్వాడి కేంద్రాల్లో గర్భిణీ లు పాలిచ్చే తల్లులతో, శిశువులు,చిన్న పిల్లల పోషణ పై సలహా సమావేశాలు నిర్వహించారు. చిరు ధాన్యాల పై, పౌష్టికాహార పదార్థాల వినియోగంపై అవగాహన కల్పించడం జరిగింది.ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో కిశోర బాలికల కోసం రక్తపరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్లు మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్య సమసమాజం రూపుదిద్దుకుంటుంద ని అన్నారు. ఈ నెల16వ తేదీ వరకు జరగనున్న పోష ణ మహోత్సవాల్లో ప్రతి ఇంటిని సందర్శించి పోషణ లోపం ఉన్న గర్భిణీలను, తల్లులను,చిన్నారులను గుర్తించి ఆరోగ్య వంతులుగా చేయడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. పిల్లల ఆరోగ్య పరిర క్షణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పోషణ మాస ఉత్సవాల సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో అంగన్వాడి టీచర్లు, గర్భిణీలు, బాలింతలు,చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## ఒకటవ అంగన్వాడి సెంటర్లో చిన్నారి జన్మదిన వేడుకలు



**స్టేషన్ ఘన్పూర్/అక్టోబర్ 15 (జర్నలిస్ట్ వార్త) :** మండలంలోని తాటికొండ గ్రామంలో గల ఒకటవ అంగన్వాడి సెంటర్ లో బుధవారం బాణాల మౌనిక - కుమార్ దంపతుల కూతురు, చిన్నారి బాణాల రిషిక జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా జన్మదిన కేక్ కట్ చేయించి రిషిక కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అంగన్వాడీ చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో అంగన్వాడీ టీచర్, గర్భిణీలు, తల్లుల, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ యాంత్రీకరణకు దరఖాస్తుల ఆహ్వానం

## సబ్సిడీపై యంత్ర పరికరాలు - రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**హనుమకొండ బ్యూరో /అక్టోబర్15(జర్నలిస్ట్ వార్త):** ధర్మసాగర్ మండలంలోని రైతులకు వ్యవసాయ పనుల్లో ఆధునికతను ప్రోత్సహించడం, శ్రమను మరియు వ్యయాన్ని తగ్గించేందుకు ఉద్దేశించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద సబ్సిడీతో యంత్ర పరికరాలను పంపిణీ చేయనున్నారు.

ఈ పథకం ద్వారా రైతులు తమ అవసరాలకు అనుగుణంగా ఉన్న పరికరాలను పొందే అవకాశముందని మండల వ్యవసాయ శాఖాధికారి తెలిపారు. ఆసక్తి గల రైతులు వెంటనే దరఖాస్తులు సమర్పించాలని ఆయన సూచించారు.

**అందుబాటులో ఉన్న పరికరాలు - గరిష్ట సబ్సిడీ వివరాలు:**

బ్యాటరీ పిచికారీ యంత్రం -1,000 వరకు
శక్తి పిచికారీ యంత్రం -10,000 వరకు
నేల దున్నే రోటావేటర్ -50,000 వరకు
విత్తన-ఎరువుల యంత్రం -30,000 వరకు
నేల కలపే యంత్రం -20,000 వరకు
మొలకల మధ్య కలుపు యంత్రం -15,000 వరకు
గడ్డి కత్తిరించే యంత్రం -35,000 వరకు
చిన్న ట్రాక్టర్ (శక్తి దున్నె) -1,00,000 వరకు
గడ్డి కట్టలు కట్టే యంత్రం -2,00,000 వరకు
ఇతర చిన్న, పెద్ద వ్యవసాయ పనిముట్లు కూడా అందుబాటులో ఉన్నాయి.

**దరఖాస్తు విధానం:**

రైతులు దరఖాస్తుతో పాటు కింది పత్రాలను జతచేయాలి:

1. పాస్ పుస్తక ప్రతులు
2. ఆధార్ కార్డు ప్రతులు
3. బ్యాంకు ఖాతా వివరాలు
4. కుల ధృవీకరణ పత్రం (ఎస్సీ, ఎస్టీ రైతులు తప్పనిసరిగా)

రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రాజేష్ తెలిపారు